ఘాట్ రోడ్డులో ప్రమాదాల నివారణకు చర్యలు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతా లను గుర్తించి, వాటి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ప్రాంతీయ సంయుక్త రవాణాశాఖ కమిషనర్ కృష్ణవేణి పేర్కొన్నారు. కడప డీటీసీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లా డుతూ... ప్రమాదాలు గువ్వలచెరువు ఘాట్ రోడ్డుకు రెండు వైపులా విశ్రాంతి స్థలాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. సుదూర ప్రాంతాలకు వెళ్లే వారు వాహనాలను అక్కడ ఆపి కాసేపు విశ్రాంతి తీసుకుని, ముఖం కడుక్కుని వెళ్లే విధంగా చర్యలు చేపడతామని చెప్పారు. కొత్తగా వచ్చిన వాహన్ వెబ్‌సైట్‌పై ఆర్టీవోలు, బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించామన్నారు. వారు చెప్పిన లోపాలను సరి చేశామని పేర్కొన్నారు. ఈ ఏడాది రవాణాశాఖకు ఆదాయం తగ్గింది, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టామని వివరించారు. ప్రజలు తమ సమస్యలపై నేరుగా అధికారులను కలవాలని, మధ్యవర్తులను సంప్రదించవద్దని సూచించారు. సమావేశంలో డీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

గువ్వలచెరువులో విశ్రాంతి స్థలాలు : జేటీసీ


మాట్లాడుతున్న జేటీసీ కృష్ణవేణి, పక్కన డీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి

ఎక్స్‌ప్రెస్ హైవేలో ఇరుగ్గా వంతెనల నిర్మాణం

పనులు అడ్డుకున్న చింతలజూటూరు గ్రామస్థులు

పులివెందుల (వేముల), న్యూస్‌టుడే: గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణ పనుల్లో భాగంగా చేపడుతున్న వంతెన నిర్మాణాలు ఇరుగ్గా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ చింతలజూటూరు గ్రామస్థులు గురువారం పనులను అడ్డుకున్నారు. దీంతో సమస్య పోలీసుస్టేషన్‌కు చేరుకుంది. కొడికొండ చెక్ పోస్టు నుంచి పులివెందుల మీదుగా మేదరమెట్ల వరకు రూ.17 వేల కోట్ల వ్యయంతో ఎక్స్‌ప్రెస్ వే పనులు చేపట్టారు. ఇందులో భాగంగా పులివెందుల ప్రాంతంలో నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. ఇక్కడ వంతెనలను ఇరుగ్గా నిర్మిస్తున్నా రని దీంతో భవిష్యత్తులో వ్యవసాయ పనులకు భారీ యంత్రాలు వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందని రైతులు ఆరోపిస్తున్నారు. ఆరు మీటర్ల వెడల్పు, ఆరుమీటర్ల ఎత్తుతో నిర్మాణాలు చేపట్టాలని రైతులు గురువారం ఆందోళన చేపట్టారు. దీంతో గుత్తేదారు విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. వారు రైతులను పిలిపించి మాట్లాడారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు నిర్మాణ పనులను నిలిపి వేయాలని గుత్తేదారుకు పోలీసులు సూచించారు.


ఈనాడు వైయస్సార్
శుక్రవారం అక్టోబరు 11, 2024

దుర్గతి నాశిని... మహిషాసురమర్దని

దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా బుధవారం జగన్మాత దుర్గతులను నాశనం చేసి సద్గతులను ప్రసా దించే మంగళకారిణిగా దుర్గమ్మగా భక్తులకు దర్శనమిచ్చారు... జిల్లావ్యాప్తంగా ప్రముఖ ఆలయాల్లో సింహ వాహినియై తేజోమయ రూపంలో జగజ్జనని భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రుల్లో దుర్గమ్మను పూజిస్తే దుర్గతులు, దుర్గణాలు నాశనమై సద్గుణ రాశులను ప్రసాదిస్తుందని భక్తుల నమ్మిక. పలు ఆలయాల్లో మంగళ గౌరిగా అమ్మవారిని అలంకరించారు. ప్రధాన ఆలయాల్లో అమ్మవారి దేదీప్య రూపాన్ని దర్శించుకో వడానికి భక్తులు బారులు తీరారు. ఆయా కార్యక్రమాల చిత్రాలివి. - న్యూస్‌టుడే బృందం


ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో దర్శనానికి బారులు తీరిన భక్తులు


మైదుకూరు అమ్మవారిశాలలో...


ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో మహిషాసురమర్దని అలంకారంలో కన్యకాపరమేశ్వరీదేవి


కడప లలిత పంచాయతన ఆలయంలో దుర్గాదేవిగా అమ్మవారు


కడప ఓంశాంతినగర్‌లో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేదికపై అష్ట లక్ష్ములుగా యువతుల దర్శనం


కన్యతీర్థంలో మహిషాసురమర్దని అలంకారంలో...


కరుణించుమా కనకదుర్గ : కడప విజయదుర్గ ఆలయంలో...


వాసవీ నమోస్తుతే : కడప అమ్మవారిశాలలో

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి


గ్రామస్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టరు శివశంకర్

కలసపాడు, న్యూస్‌టుడే: పారిశుద్ధ్యంపై దృష్టి సారించి ఇతర ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టరు శివశంకర్ తెలిపారు. గురువారం ఆయన మండలంలోని ఎగువ రామాపురంలో 'గ్రామో దయం' కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. పలు వీధులు, గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రం, చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిం చారు. రహదారులపై మురుగు నీరు ప్రవహించకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పలువురు పింఛన్లు, ఇతర సమస్యలను కలెక్టరు దృష్టికి తెచ్చారు. కొన్ని నెలలుగా వేతనాలు రావడంలేదని హరిత రాయబారులు కోరగా.. గ్రామంలో ప్రభుత్వ భూమి లీజుకిచ్చి వచ్చే ఆదాయాన్ని హరిత రాయబారులకు ఇవ్వాలని తహసీల్దారు మధురవాణికి కలెక్టరు సూచించారు. తాను తర్వాత పర్య టనకు వచ్చేలోపు ఈ సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదే శించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి, ఈవోపీఆర్‌డీ మురారి, వైద్యాధికారి శైలజ, సీడీపీవో లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సృజన, సర్పంచి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉగ్ర పెన్నా... భద్రత సున్నా



మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి బుధవారం 2,500 క్యూసె క్కుల నీటిని విడుదల చేశారు. దీంతో పెన్నాలో వరద ఉద్ధృతి పెరి గింది. దీంతో జమ్మలమడుగు నుంచి వేపరాలకు వెళ్లే రహదారి కోతకు గురైంది. ఇది ప్రమాదకరమైన స్థలం కాగా కనీసం హెచ్చరిక బోర్డు, రక్షణ కంచె కూడా ఏర్పాటు చేయలేదు. అసలే దసరా సెలవుల్లో పిల్లలు సరదా కోసం నీటి ప్రవాహాన్ని చూడటానికి వెళ్తూ మృత్యువాత పడుతున్నారు. నీటి ప్రవాహం తగ్గేంత వరకు అధికారులు ఈ ప్రాంతంలో హెచ్చరిక బోర్డులతో పాటు రక్షణ కంచె కూడా ఏర్పాటు చేస్తే బాగుంటుందని పట్టణ ప్రజలు భావిస్తున్నారు.

- న్యూస్‌టుడే, జమ్మలమడుగు గ్రామీణ


చెరువులు నిండేలా... కరవు నేలకు జలకళ

ప్రాధాన్య పనులకే సర్కారు పెద్దపీట

తక్కువ వ్యయం... ఎక్కువ ఆయకట్టు సాగే లక్ష్యం

వైకాపా ప్రభుత్వం చేసిన పాపాలు ఎన్డీఏ ప్రభుత్వానికి గుదిబండగా మారు తున్నాయి. గత సర్కారు సాగునీటి ప్రాజెక్టులను విస్మరించడమే కాకుండా కనీసం కాలువల విస్తరణనూ పట్టించుకోలేదు. ఫలితంగా ఆయకట్టు సాగుకు నోచుకోకుండా బీడుగా మారిపోయింది. ఈ పరిస్థితిలో ఎన్డీఏ సర్కారు ఓ నిర్ణ యానికి వచ్చింది. ఆర్థిక వనరులను దృష్టిలో ఉంచుకుని 25 శాతంలోపు ఉన్న పనుల్ని రద్దు చేయాలని... ప్రాధాన్యం ఉన్న పనుల్ని గుర్తించి పూర్తి చేయాలనే లక్ష్యం పెట్టుకుంది. ఈ మేరకు వైకాపా ప్రభుత్వం చేపట్టి.. అసంపూ ర్తిగా నిలివేసిన రూ.14,400 కోట్ల పనుల్ని రద్దు చేసి ప్రాధాన్యతా క్రమంలో రూ.876 కోట్ల పనుల్ని ఎంపిక చేసింది. రద్దు చేయనున్న పనుల్లో 25 లోపు ఉన్నవి ఐదు ఉండగా.. పనులే చేపట్టనివి 11 వరకు ఉన్నట్లు గుర్తించి ప్రభుత్వానికి నివేదించారు. - ఈనాడు, కడప, న్యూస్‌టుడే, కడప

కుందూపై ఎత్తిపోతల పథకం



కుందూనదిపై ఎత్తి పోతల పథకాన్ని ప్రాధాన్యత కింద ప్రతిపాదించారు. కుందూనది నుంచి 9 టీఎంసీల నీటిని తెలుగుగంగ ప్రధాన కాల్వలోకి ఎత్తిపోసి బ్రహ్మంసాగర్ రిజ ర్వాయర్‌ను నింపను న్నారు. ఈ విధానం కింద 1.58 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకర ణతో పాటు మైదుకూరు, బద్వేలు నియోజకవ ర్గాల్లోని చెరువులన్నింటినీ అనుసంధానం చేసి నీటిని నింపనున్నారు. ఇందుకోసం రూ.564 కోట్లు అవసరమని ప్రతిపాదించారు. భూసేక రణ 75 శాతం వరకు పూర్తి చేశారు.


గండికోట జలాశయం

- హంద్రీ-నీవా కాలువ విస్తరణ, ఆధునికీరణ పనులు తంబళ్లపల్లె నియోజకవర్గంలో చేపట్టారు. ఈ పనుల్ని వేగవంతం చేయడానికి ఇటీ వల మంత్రి నిమ్మల రామానాయుడు క్షేత్ర పరిశీలన చేపట్టి ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలిచ్చారు.



- తెలుగుగంగ ప్రధాన కాలువ నుంచి వెయ్యి ఎక రాలకు సాగునీరు అందించే దిశగా ఎత్తిపోతల పథ కాన్ని మైదుకూరు నియోజకవర్గానికి ఉపయుక్తంగా చేప డుతున్నారు.



- గాలేరు-నగరి సుజల స్రవంతి 1,2 దశల్లో భాగంగా వామికొండ, సర్వరాయ సాగర్ జలాశయాల నుంచి ప్రధాన, ఉప కాలువలను పూర్తి చేయడానికి రూ.212.89 కోట్లు అవసరమని గుర్తించి ప్రతిపాదించారు. ఈ పనుల్ని పూర్తి చేయడం ద్వారా 35 ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుంది. ఇప్పటికే జీఎన్‌ఎస్‌ఎస్ ప్రధాన కాలువ 34 కి.మీ మేర పూర్తి అయింది. అసంపూర్తి పనులు పూర్తి చేయడం ద్వారా కమలాపురం నియోజక వర్గానికి ఉపయుక్తంగా ఉంటుంది. ఈ ప్రాజెక్టు కాలువ కడప సమీపం వరకు పూర్తి చేసే పక్షంలో గ్రావిటీ ద్వారా కడప నగరంలో 3.50 లక్షల మందికి తాగునీరు అందించవచ్చనే అంచనాకు వచ్చారు. గండి కోట ప్రాజెక్టులో పూర్తి స్థాయిలో నీటి నిల్వ చేపట్టారు.



- చిత్రావతి ప్రాజెక్టు 10 టీఎంసీల నీటి సామర్థ్యం ఉంది. కాలువ గోడల నిర్మాణం, ప్రాజెక్టు నిర్వహణకు రూ.13.46 కోట్లు అవ సరమని గుర్తించారు. పైడిపాళ్యం రిజర్వా యర్ నిర్వహణ పనులను రూ.34.40 కోట్లతో చేపట్టాలని ప్రతిపాదించారు.



- పీబీసీ ప్రాజెక్టు ప్రధాన కాలువల వంతెన మరమ్మతులకు రూ.96 లక్షలతో పనులు చేపట్టనున్నారు. 65 వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందిస్తున్న వంతెన లీకేజీని అరికట్టడానికి చర్యలు చేపడుతున్నారు.
- పులివెందుల బ్రాంచి కెనాల్ ఆక్విడెక్టు ఆధునికీకరణకు రూ.5.63 కోట్లతో పనులు చేపట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.



ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులు

ఉమ్మడి కడప జిల్లాలోని ప్రాజెక్టుల్లో 75 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోగా.. గండికోట, పైడిపాళ్యం, చిత్రావతి, మైలవరం, వామికొండ, సర్వరాయ సాగర్, వెలిగల్లు, ఎస్‌ఆర్-1, ఎస్‌ఆర్-2, బ్రహ్మంసాగర్ ప్రాజెక్టులున్నాయి. వీటి నిర్వహణ, పంట కాలువల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నారు.

సమాచారం సేకరిస్తున్నాం

ఇప్పటికే చేపట్టిన సాగునీటి పనులు 25 శాతం లోపే జరి గిన వాటి వివరాలను పంపించాలని ఉన్నత స్థాయి నుంచి ఆదేశాలు అందాయి. ఈ వారంలో ఉన్నతాధికారులకు నివే దిస్తాం. తదుపరి వచ్చే ఉత్తర్వులను అనుసరించి ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టి పూర్తి చేయిస్తాం. ఆయకట్టుకు నీరిస్తాం. - ఎం.మల్లికార్జునరెడ్డి, సీఈ, నీటిపారుదలశాఖ

తెలంగాణకు కలెక్టర్ శివశంకర్

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: కలె క్టర్ శివశంకర్ లోతేటి తెలంగాణకు వెళ్ల నున్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఆయనను తెలంగాణ క్యాడర్‌కు కేటాయిం చినా, ఏపీలో కొనసాగుతున్నారు. ఈ నేప థ్యంలో కేంద్ర ప్రభుత్వం ఏపీ, తెలంగాణా ల్లోని పలువురు ఐఏఎస్‌ల క్యాడర్‌పై స్పష్ట తనిచ్చి రిలీవ్ కావాలని ఆదేశించింది. ఏపీ నుంచి తెలంగాణకు వెళ్లే వారిలో శివశం కర్ లోతేటి కూడా ఉన్నారు. ఆయన జులై 6న కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. కొద్దికాలంలోనే పాలనపై తనదైన ముద్ర వేశారు. ఆయన స్థానంలో ప్రభుత్వం ఇంకా ఎవరినీ నియమించలేదు.

జడ్పీలో వైకాపా మార్కు హల్‌చల్

అధికారం లేకున్నా బెదిరింపులు

నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశం

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: 'ఏం సీఈవో గారూ! ఛైర్‌పర్సన్‌కు తెలియకుండా, ఆమె అనుమతి తీసుకోకుండా జడ్పీ అభి వృద్ధి పనులు ఎలా చేపడతారు. 15వ ఆర్థిక సంఘం నిధుల వివరాలు కూడా తెలియజేయడం లేదట! అధికారంలో మేం లేమని ఇలా చేయడం తగదు. మీ ఇష్ట మొచ్చినట్లు పనులు చేపడితే ఎలా' అని వైకాపాకు చెందిన మాజీ ఎమ్మెల్యే ఒకరు గురువారం జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డిని ఫోన్‌లో ప్రశ్నించారు. కడప నగరంలో కీల కహోదాలో ఉన్న వైకాపా సీనియర్ నాయ కుడితో కలిసి ఆ మాజీ ఎమ్మెల్యే గురు వారం జడ్పీ ఛైర్‌పర్సన్ ఛాంబరుకు వచ్చి హల్‌చల్ చేశారు. నిబంధనల మేరకు జడ్పీటీసీ సభ్యులు, ఎమ్మెల్యేలు వచ్చి జిల్లాలో సమస్యలపై చర్చించవచ్చు. అయితే పదవిలో లేని నాయకుడు... ఛైర్ పర్సన్ ఛాంబరుకు వచ్చి జడ్పీ సీఈవోకు ఫోన్ చేసి, ఇలా అనడం బెదిరించడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు కడప నగరంలో ఉన్న వైకాపా కీలకనేతకు జడ్పీకి వచ్చి సమస్యలపై గళం విప్పే హక్కు లేదు. దీంతో పాటు ఇటీవల జరి గిన బదిలీల వ్యవహారంపై కూడా అడిగి నట్లు తెలిసింది. వీరిద్దరూ జడ్పీకి వచ్చి అధికారితో బెదిరింపు ధోరణితో ప్రశ్నిం చడం సరికాదనే విమర్శలు వస్తున్నాయి.

సర్వజనానికే పరీక్ష

20 రోజుల పాటు తిరగాల్సిందే ● రోజూ వందలాది మంది వెనక్కి

● రిమ్స్‌లో యంత్రాల కొరతతో రోగుల అవస్థలు


స్కానింగ్ కోసం కేంద్రం బయట వరండాలో కూర్చుని నిరీక్షిస్తున్న మహిళలు, రోగులు

న్యూస్‌టుడే, సర్వజన ఆసుపత్రి

జిల్లాలో పెద్దాసుపత్రిగా పిలిచే కడప రిమ్స్‌లో స్కానింగ్ కోసం వచ్చే రోగులకు అవస్థలు తప్పడం లేదు. సరిపడా యంత్రాలు, వైద్యులు లేకపోవడంతో దాదాపు 20 రోజుల తర్వాత రావాలని సిబ్బంది సూచిస్తున్నారు. అత్యవసరమైనా ఎవరూ పట్టించుకో వడం లేదు. దీంతో చాలా మంది ప్రైవేటు ఆస్పత్రులకెళ్లి వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ● కడప రిమ్స్‌కు రోజూ 1,200 నుంచి 1,500 మంది రోగులు ఓపీ, ఐపీకి వస్తుంటారు. వీరిలో పేదలే ఎక్కువగా ఉంటారు. వారిలో దాదాపు రోజుకు 200 నుంచి 250 మంది వరకూ స్కానింగ్‌కు వస్తారు. గర్భిణుల్లో బిడ్డ ఎదుగుదల పరిశీలించడా నికి ఈ పరీక్ష తప్పనిసరి. ఇతర అత్యవసరమైన రోగులకూ వైద్యులు స్కానింగ్ చేయమని రాస్తారు. పరీక్ష కేంద్రానికి వెళ్తే 20 రోజుల తర్వాత రావాలని సిబ్బంది చెప్పడంతో రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైద్యులూ లేరు... పరికరాలుండవు

రిమ్స్ రేడియాలజీ విభాగంలో మొత్తం 12 మంది వైద్యులుండాల్సి ఉండగా ఒక ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ మాత్రమే ఉన్నారు. స్కానింగ్ యంత్రాలు విభాగానికి ఒక్కటి చొప్పున అయిదు నుంచి ఆరు ఉండాల్సి ఉండగా, ఒక్కటి మాత్రమే ఉంది. గత ప్రభుత్వ హయాంలో పరికరాలు కావాలని అనేక మార్లు విన్నవించినా యంత్రాలు మంజూరు చేయలేదు. దీంతో రోజుకు అత్యవసర రోగులకు 50 మందికి, ఓపీ రోగులకు 30 మందికి మాత్రమే స్కానింగ్ చేస్తున్నారు. దాదాపు 200 మంది స్కానింగ్ చేయించుకోకుండానే వెనక్కి వెళుతున్నారు. వారికి 20 రోజుల తర్వాత గడువు ఇస్తు న్నారు. ఆరోగ్యం విషమిస్తే అన్ని రోజులు నిరీక్షించగలడా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీంతో చాలామంది అప్పులు చేసి ప్రైవేట్ ఆసుపత్రులకు వెళుతున్నారు.

చాలా ఇబ్బందిగా ఉంది



మా పాపకు కడుపునొప్పిగా ఉంటే సర్వజన ఆసుపత్రిలో వైద్యులకు చూపించాం. స్కానింగ్ చేయాలని సూచించారు. ల్యాబ్ వద్దకు వెళ్తే ఎక్కువ మంది ఉన్నారు. వైద్యులు రాసిన చీటీ సిబ్బందికి చూపిస్తే, ఇరవై రోజుల తరవాతే రమ్మంటున్నారు. అప్పటి వరకు ఎలా ఆగాలి. పేదలను ఇబ్బంది పెట్టడం తగదు. - వసంత, రోగి తల్లి, కోడూరు

శస్త్ర చికిత్స వాయిదా వేశారు



నాకు ఒంట్లో బాగోలేకపోతే వైద్యులు పరిశీలించి అడ్మిట్ చేశారు. స్కానింగ్ చేయాలని రాసిచ్చారు. మూడు రోజుల నుంచి అక్కడికి, వార్డుకు తిరు గుతున్నా. ఈ రోజు, రేపు అంటు న్నారు. దీంతో శస్త్రచికిత్స కూడా వాయిదా వేశారు. అడిగితే ఆలస్యం అవుతుందని చెబుతున్నారు. మిషన్ ఒక్కటే ఉందంటున్నారు. అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

- రమణమ్మ, వేంపల్లె

కొరత వాస్తవమే

ప్రస్తుతం రేడియాలజీ విభాగంలో మిషన్ ఒక్కటి మాత్రమే ఉంది. మరొకటి పోర్టబుల్ ఉన్నా అది సరిగ్గా పనిచేయదు. రోగులు ఇబ్బంది పడకూడదని కనీస పరిమితితో స్కానిం గులు చేస్తున్నాం. ఈ విభాగానికి 12 మంది వైద్యులకు ఇద్దరు మాత్రమే ఉన్నాం. వైద్యులు, యంత్రాల కొరతపై డీఎంఈ, కలెక్టర్, ప్రిన్సిపల్, ఆసుపత్రి సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లాం.

- డాక్టర్ శారద, రేడియాలజీ విభాగాధిపతి



(c) eenadu

తప్పిన పెను ప్రమాదం


రోడ్డు పక్కకు వెళ్లి ఆగిన ఆర్టీసీ బస్సు

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే: కడప-రాయచోటి రహదారిలోని సీకే దిన్నె మండలం గువ్వల చెరువు ఘాట్ సమీపంలోని మద్దిమడుగు బిడికి వద్ద గురువారం ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. పోలీసుల కథనం ప్రకారం... మద్దిమడుగు బిడికి వద్ద పాలవ్యాన్ ఆగి ఉండగా రాయచోటి వైపు వెళ్తున్న లారీ వచ్చి దానిని ఢీకొని, రోడ్డుపై అడ్డంగా వచ్చేసింది. అదే సమయంలో అటుగా వస్తున్న బెంగుళూరు- ప్రొద్దుటూరు ఆర్టీసీ బస్సు డ్రైవర్ ప్రమాదాన్ని గుర్తించి, ఐచర్ లారీని తప్పించి బ్రేకు వేశారు. దీంతో బస్సు రోడ్డు పక్క గుంతలోకి వెళ్లి ఆగింది. ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. లారీ డ్రైవర్ సత్యనారాయణ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాయబండ పేలిన ఘటనలో భర్త మృతి

ఖాజీపేట, న్యూస్‌టుడే: వాయుబండ పేలిన ఘటనలో చికిత్స పొందుతూ మండల పరిధిలోని వెంకట్రామాపురానికి చెందిన జయరామరాజు (58) అనే వ్యక్తి మృతి చెందారు. గత గురువారం పొలానికి వెళ్లి వచ్చి ఇంట్లో వంట కోసం గ్యాస్ స్టవ్ వెలిగించే క్రమంలో అది పేలి భార్యాభర్తలు తీవ్రగాయాల పాలయ్యారు. ఈ క్రమంలో రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఇతను బుధవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య



అట్లూరు, న్యూస్‌టుడే : ప్రేమ విఫలమై అట్లూరు మండలంలోని వేమలూరుకు చెందిన **నడివీధి నవీన్** (21) కనుమలోపల్లి సమీపంలో రైలుపట్టాలపై పడుకొని ఆత్మహత్మకు పాల్పడ్డారు. కుటుంబీకుల వివరాల మేరకు.. నవీన్ కడపలో ట్రావెల్స్‌లో పని చేస్తున్నారు. బుధవారం యథావిధిగా ఇంటి నుంచి వెళ్లిన నవీన్ ట్రావెల్స్‌కు వెళ్లకుండా కనుమలోపల్లి వద్ద దిగి రైలు పట్టాలపై పడి ఆత్మహత్య చేసుకున్నారు. రైల్వే పోలీసులు నవీన్ ఆత్మహత్య విషయాన్ని గ్రామానికి తెలిపారు. యువకుడు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఒక్కగానొక్క కుమారుడు నవీన్ మృతితో తల్లిదండ్రులు ఈశ్వరమ్మ, బ్రహ్మయ్య కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆత్మహత్యకు కారణాలు విభిన్నప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రేమలో విఫలం కావడం వలనే ఆత్మహత్యకు కారణమని, నవీన్ వద్ద రాసిపెట్టిన లేఖ ఆధారంగా పోలీసులు తెలుపుతున్నారు. పూర్తి స్థాయిలో విచారిస్తామని రైల్వే పోలీసులు స్థానిక నాయకులకు తెలిపారు. నవీన్ కుటుంబాన్ని గురువారం ఎమ్మెల్యే సుధ రిమ్స్‌లో పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు.

భార్య దూరమైందని బలవన్మరణం

ఖాజీపేట, న్యూస్‌టుడే: భార్య దూరమైందన్న బాధ భరించలేక ఖాజీపేట మండలంలోని కొత్తపేటలో నివాసముంటున్న సుధాకర్ (35) అనే వ్యక్తి విష గుళికలు తిని బలవన్మరణం చెందారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా దిసిలి పల్లెకు చెందిన ఇతను భార్యతో గొడవపడి ఖాజీపేట మండలం కొత్తపేట గ్రామంలోని అతని సోదరుడి వద్ద ఉంటున్నారు. బుధవారం ఉదయం మద్యంలో విష గుళికలు తీసుకుని అపస్మారకస్థితిలో ఉండడంతో సాయంత్రం గుర్తించిన అన్నవదినలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారని పోలీసులు తెలిపారు.

లారీ డ్రైవర్‌కు మూడేళ్ల జైలుశిక్ష

వేముల, న్యూస్‌టుడే: రోడు ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన లారీడ్రైవర్‌కు మూడేళ్ల జైలుశిక్ష, రూ.6 వేలు జరిమానా విధిస్తూ పులివెందుల జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.చంద్రశేఖర్‌రెడ్డి గురువారం తీర్పునిచ్చారు. వేముల మండలం వేల్పులకు చెందిన వల్లూరు చంద్రశేఖర్, దర్బార్‌రెడ్డి 2017 నవంబరు 15న ట్రాక్టరులో వస్తుండగా చాగలేరు మలుపు వద్ద లారీ ఢీకొంది. దీంతో చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనకు కారణమైన తమిళనాడుకు చెందిన లారీ డ్రైవర్ మునిస్వామి సెంథిల్‌పై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుత ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ రఘునాథ్ కేసులోని ప్రధాన సాక్షులను సకాలంలో కోర్టుకు హాజరుపరచగా, అసిస్టెంటు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మధుసూదనరావు వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో లారీడ్రైవర్‌కు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.6 వేలు జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పు ఇచ్చారు.

నిబంధనలు తొక్కేసి... సామగ్రి కుక్కేసి!

ప్రైవేటు ట్రావెల్స్‌లో ఇష్టారాజ్యంగా సరకు రవాణా

–న్యూస్‌టుడే, కడప నేరవార్తలు

జిల్లాలోని ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. ఒక్కో బస్సులో టన్నుల కొద్దీ సామగ్రిని దిగుమతి చేసుకుంటున్నాయి. ప్రయాణికులు బరువు కంటే ఇదే ఎక్కువగా ఉంటుంది. ప్రయాణికుల లగేజీతో పాటు వివిధ రకాల సామగ్రిని బస్సుల్లో వేసుకుని తీసుకొస్తున్నారు. వీటిలో కొన్ని ప్రమాదకర వస్తువులూ ఉంటున్నాయి. పొరపాటున మార్గమధ్యంలో ఏదైనా జరిగితే పెనువిపత్తు తప్పదు. కట్టడి చేయాల్సిన రవాణాశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు.

రోజుకు 50-60 బస్సుల్లో...

జిల్లా నుంచి ప్రతిరోజూ హైదరాబాదు, విజయవాడ, బెంగళూరు, తిరుపతి, చిత్తూరు తదితర ప్రాంతాలకు సుమారు 50 నుంచి 60 బస్సులు ప్రతిరోజూ వెళ్తుంటాయి. వీటిలో నిబంధనల ప్రకారం ప్రయాణికుల లగేజీకి మాత్రమే అనుమతి ఉంది. కానీ నిర్వాహకులు ప్రతి రోజూ విజయవాడ, హైదరాబాదు నుంచి వందల టన్నుల్లో సామగ్రిని రవాణా చేస్తున్నారు. ప్రొద్దుటూరులో అత్యధికంగా దిగుమతి చేస్తున్నారు. ప్రైవేటు బస్సుల పైన, డిక్కీలో, ఒక్కో సారి లోపల కూడా వేసి తీసుకొస్తున్నారు.

ఏముందో ఎవరికి తెలుసు...

ప్రైవేటు ట్రావెల్స్‌లో వచ్చే వివిధ రకాల సామగ్రిలో అసలు ఏముందనే విషయం ఎవరికీ తెలియదు. ఏ వస్తువు వేస్తున్నారని నిర్వాహకులు ప్రశ్నించరు. ఆర్టీసీ వారైతే మార్గంమధ్యలో తనిఖీలుంటాయని, దొరికితే ఉద్యోగాలు పోతాయనే భయం ఉంటుంది. ప్రైవేటు ట్రావెల్స్ వారికి అలాంటి భయాలుండవు. వీటిలో ఎక్కువగా అట్టపెట్టెలు, చెక్కలు, ఎలక్ట్రికల్ సామగ్రి తదితర మండే స్వభావం ఉన్న సరకులు తీసుకొస్తుంటారు. ఎక్కడైనా చిన్న నిప్పురవ్వ అంటుకుంటే క్షణాల్లో మంటలు వ్యాపిస్తాయి. పైగా బస్సులు విపరీతమైన వేగంతో వస్తుంటాయి. ఇంత జరుగుతున్నా రవాణాశాఖ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు.


ప్రైవేటు బస్సుల్లో వచ్చిన సామగ్రి

జరిమానా విధిస్తాం

ప్రైవేటు బస్సుల్లో కేవలం ప్రయాణికుల లగేజీ మాత్రమే ఉండాలి. అధిక సామగ్రి తీసుకురావడం నిబంధనలకు విరుద్ధం. ఆకస్మిక తనిఖీలు చేసి ఎక్కువ లగేజీ ఉంటే జరిమానా విధిస్తాం. ప్రొద్దుటూరుకు ఎక్కువగా దిగుమతి చేస్తుంటారు. ప్రైవేటు ట్రావెల్స్ వారికి హెచ్చరికలు జారీ చేస్తాం. - మురళి, బాధ్య ఆర్టీవో, కడప

కనీస పింఛను రూ.9 వేలు ఇవ్వాలని ఆందోళన

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస పింఛను రూ.9వేలు ఇవ్వాలని పింఛనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి డిమాండు చేశారు. దీనిపై గురువారం కడప పీఎఫ్ కార్యాలయం వద్ద సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ అనేది భిక్ష కాదని, హక్కని పేర్కొన్నారు. పింఛన్‌దారులకు ఆరోగ్యశ్రీ కార్డులు, తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండు చేశారు. రైల్వేలో సీనియర్ సిటిజన్స్‌కు రాయితీలు కల్పించాలన్నారు. ఎన్నికల ముందు దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన ధర్నాలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సూచించారు. పీఎఫ్ కార్యాలయంలో సాంకేతిక సమస్యలతో పలువురు ఇబ్బంది పడుతున్నారని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సంఘం నాయకులు రఘునాథ్‌రెడ్డి, గుర్రప్ప, చెన్నకేశవరెడ్డి, దస్తగిరిరెడ్డి, నారాయణ, శ్రీనివాసులురెడ్డి తదితరులున్నారు.




కడప పీఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

మద్యం దుకాణాల దరఖాస్తులకు నేటితో తెర


వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్, అధికారులు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేయనున్న 139 మద్యం దుకాణాలకు దరఖాస్తు గడువు శుక్రవారం రాత్రి 7 గంటలతో ముగుస్తుందని, 14వ తేదీ ఉదయం 8 గంటలకు కడప జడ్పీ సమావేశ మందిరంలో కలెక్టరు శివ శంకర్ ఆధ్వర్యంలో డ్రా తీస్తారని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు వెల్లడించారు. కడప ప్రొహిబిషన్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఒకరు ఎన్ని దుకాణాలకైనా, జిల్లాలో ఎక్కడైనా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఇప్పటి వరకు 2225 దరఖాస్తులొచ్చాయని తెలిపారు. ఇంకా ఒక్క రోజు గడువు ఉండడంతో మరిన్ని వచ్చే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు నిర్భయంగా వచ్చి దాఖలు చేయవచ్చని సూచించారు. 16వ తేదీ నుంచి కొత్త మద్యం దుకాణాలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఇప్పటివరకూ కడపలో 30 దుకాణాలకు 491 దరఖాస్తులు, సిద్దవటంలో 8కు 80, ప్రొద్దుటూరులో 19కు 438, జమ్మలమడుగులో 14కు 103, మైదుకూరులో 16కు 247, బద్వేలులో 15కు 330, ఎర్రగుంట్లలో 14కు 163, పులివెందులలో 16కు 290, ముద్దనూరులో 07కు 83 దరఖాస్తులొచ్చాయని చెప్పారు. ఎక్సైజ్ పర్యవేక్షణాధికారి రవికుమార్, ఏఈఎస్ వినోద్‌కుమార్, సీఐ విశ్వనాథ్‌రెడ్డి ఉన్నారు.

‘కెమ్కామ్’లో అత్యుత్తమ పరిశోధకుల జాబితాలో శంకర్


ఎన్‌వీ.శంకర్

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: యూకేలోని ప్రతిష్ఠాత్మకమైన పరిశోధక కోపసిడెక్స్ జర్నల్ ‘కెమ్కామ్’లో ప్రచురితమైన అత్యుత్తమ పరిశోధకుల జాబితాలో యోగి వేమన విశ్వవిద్యాలయం మెటీరియల్ సైన్స్ అండ్ నానో టెక్నాలజీ ఆచార్యుడు ఎన్.వి.శంకరకు చోటు దక్కింది. కెమ్కామ్ జర్నల్ 60వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆయనను ఎంపిక చేసింది. ఈ మేరకు యూకే రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ కెమికల్ కమ్యూనికేషన్ జర్నల్ బృందం నుంచి మెయిల్ ద్వారా సమాచారాన్ని పంపారు. శంకర్ గతంలో మెటీరియల్స్ ఎనర్జీ రంగంలో ప్రపంచంలోని టాప్ రెండు శాతం అత్యంత ప్రభావవంతమైన శాస్త్రవేత్తల్లో ఒకరుగా నిలిచారు. నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆఫ్ కొరియా ద్వారా అత్యుత్తమ విదేశీ పరిశోధకులకు అందించే బ్రెయిన్ పూల్ ఫెలోషిప్ ఇటీవలే సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అధికారులు, అధ్యాపకులు శంకర్‌ను అభినందించారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు


మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్, జేసీ అదితిసింగ్

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: గ్రామోదయం, నగరోదయం కార్యక్రమాల్లో వచ్చిన సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దని కలెక్టర్ శివశంకర్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి క్షేత్రస్థాయి అధికారులతో గురువారం ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో అవసరాలను గుర్తించి, వాటిపై చర్యలు చేపట్టాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే బాలామృతాన్ని ఆ లబ్ధిదారులైన పిల్లలు వాటిని తింటున్నారో లేదో గుర్తించాలని చెప్పారు. చేసే పనికి ముందు, తర్వాత ఫొటోలు తీసుకోవాలని పేర్కొన్నారు. నీటి సంఘాల ఎన్నికల్లో ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోకుండా గట్టి చర్యలు చేపట్టాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ మాట్లాడుతూ కందిపప్పు, పామాయిల్, ఉల్లి, నూనె, టమాటా అధిక ధరలకు అమ్ముతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై దృష్టిపెట్టాలని తెలిపారు. డీఆర్వో గంగాధర్‌గౌడ్, జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, ఎస్‌ఈలు శ్రీనివాసరెడ్డి, మల్లికార్జునరెడ్డి, హౌసింగ్ పీడీ రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

బ్యాట్స్‌మెన్ జోరు... సెంచరీల హోరు

కడప క్రీడలు, న్యూస్‌టుడే: ఏసీఏ అండర్-14 పురుషుల రెండు రోజుల మల్టీడే క్రికెట్ టోర్నీలో భాగంగా గురువారం వైఎస్ఆర్‌ఆర్-ఏసీఏ క్రికెట్ మైదానంలో ప్రకాశం జట్టుతో ప్రారంభమైన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చిత్తూరు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 7 వికెట్లు నష్టపోయి 407 పరుగులు చేసింది. వైటీ టెండూల్కర్ డబుల్ సెంచరీ (206)తో విజృంభించగా, కేవీఎస్ మణిదీప్ సెంచరీ (102*)తో సత్తా చాటాడు.

✦ కేఓఆర్‌ఎం మైదానంలో విశాఖపట్నంతో జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన కర్నూలు జట్టు 32.3 ఓవర్లలో 63 పరుగులకే ఆలౌటయింది. విశాఖ బౌలర్లు వినోద్ 5, భానుస్వరూప్, ప్రశాంత్ వర్మ చెరో రెండు వికెట్లు తీసి సత్తాచాటారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన విశాఖ జట్టు ఆట ముగిసే సమయానికి 58 ఓవర్లలో 295/3 స్కోరు చేసింది. ప్రణవ్ శ్రీరామ్ సెంచరీ (103), తమన్‌రెడ్డి 82 పరుగులు చేశారు.

✦ కేఎస్ఆర్‌ఎం మైదానంలో కడపతో మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన తూ.గో జట్టు 38.3 ఓవర్లలో 151 పరుగులకు ఆలౌటైంది. ప్రత్యర్థి బౌలర్లు హితేష్‌సాయి 5, ఆదిత్య 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన కడప ఆట ముగిసే సమయానికి 49 ఓవర్లలో 159/4 స్కోరు చేసింది. యోగాంజనేయ 50 పరుగులు చేశారు.


డబుల్ సెంచరీతో సత్తా చాటిన టెండూల్కర్


సెంచరీతో రాణించిన మణిదీప్


5 వికెట్లు తీసిన వినోద్

భ్రమలు వీడి వాస్తవాలతో బతకాలి: జేవీవీ



మాట్లాడుతున్న జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్, తదితరులు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: మానవుని సహజ లక్షణమైన ఉత్సుకతను పెంపొందించడమే తమ లక్ష్యమని జన విజ్ఞాన వేదిక (జేవీవీ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ అన్నారు. గురువారం స్థానిక జేవీవీ కార్యాలయంలో మూడు రోజులపాటు జరిగే రాష్ట్ర స్థాయి యూత్ మీట్ ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజం, కుటుంబం, పాఠశాలలు నేడు విద్యార్థుల్లోని ఆ ఉత్సుకతను నాశనం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ప్రజలు భ్రమల్లో కాకుండా భౌతికమైన వాస్తవాలతో బతకాలన్నారు. ప్రస్తుత కార్పొరేట్ సమాజంలో నిరుద్యోగం పెరిగిపోయిందని, దీనికి పరిష్కారం కనుగొనేందుకు యువత ముందుకు రావాలని అన్నారు. జేవీవీ నాయకులు డాక్టర్ నరసింహారెడ్డి, తవ్వా సురేష్, జిలానీబాషా, వర్మ, రాజశేఖర్, శోభన్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే వ్యాపారులకు భరోసా


మాట్లాడుతున్న తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: రాష్ట్రంలో పరిశ్రమలు రావాలన్నా.. వ్యాపారాలు జోరుగా సాగాలన్నా ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ అన్నారు. గురువారం కడపలోని హరిట వర్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మద్యం దుకాణాల ఏర్పాటుపై వైకాపా నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో అనేక పరిశ్రమలు ఏర్పాటయ్యాయని గుర్తుచేశారు. రాష్ట్ర విభజన అనంతరం కూడా ఎన్నో పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చాయని, వైకాపా ఐదేళ్ల పాలనలో వచ్చిన వాటి కంటే వెళ్లిపోయినవే ఎక్కువని విమర్శించారు. తెదేపా నేతలు బండిబాబు, సత్య, గంధం ప్రసాద్, జనసేన నాయకుడు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మృత్యుంజయుడు రామచంద్రారెడ్డి


స్వల్పగాయాలతో బయటపడిన రామచంద్రారెడ్డి


దెబ్బతిన్న ద్విచక్ర వాహనం

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: లారీ కిందకు వెళ్లిన ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జయినా, వాహనదారుడు మృత్యుంజయుడిలా బయపడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. పెండ్లిమర్రి మండలం మిట్టమీదపల్లెకు చెందిన రామచంద్రారెడ్డి పని నిమిత్తం ద్విచక్రవాహనంలో గురువారం కడపకు వచ్చారు. అనంతరం తిరిగి వెళుతూ ఐటీఐ కూడలి వద్ద ముందు వెళుతున్న పది టైర్ల లారీని ఓవర్‌టేక్ చేయడానికి ప్రయత్నించారు. ఆ సమయంలో ప్రమాదవశాత్తూ లారీ కిందకు దూసుకెళ్లారు. అప్రమత్తమైన రామచంద్రారెడ్డి వెంటనే దొర్లుకుంటూ బయటికి వచ్చారు. ద్విచక్రవాహనం టైర్ల మధ్యలో ఇరుక్కుపోయి దెబ్బతింది. అక్కడ మలుపు ఉండడంతో లారీ డ్రైవర్ నెమ్మదిగా వెళ్లడంతో రామచంద్రారెడ్డి స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ ఘటనతో కొద్దిసేపు అక్కడ ట్రాఫిక్ స్తంభించింది.

కలెక్టరేట్‌లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్తు సరఫరా లేకపోవడంతో పాలన స్తంభించింది. జాయింట్ కలెక్టర్ కూడా విద్యుత్తు అంతరాయంతో ఇబ్బందులు పడ్డారు. ఇటీవల కలెక్టరేట్ వెనుకవైపు పనులు చేస్తున్నప్పుడు విద్యుత్తు తీగలకు సంబంధించి కేబుల్స్ తెగిపోయాయి. దీంతో ఒకరోజంతా సరఫరా లేదు. తర్వాత బాగుచేశారు. అనంతరం బుధవారం రాత్రి అదే ప్రాంతంలో షార్ట్‌సర్క్యూట్ అవడంతో సరఫరా నిలిచిపోయింది. విద్యుత్తు అధికారులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మరమ్మతులు చేపట్టి 1.30 గంటల ప్రాంతంలో సరఫరా పునరుద్ధించారు.

‘ఎంపీ వ్యాఖ్యలు రాజ్యాంగ ఉల్లంఘనే’

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టడే: పార్లమెంట్ మెంబర్‌గా ప్రమాణ స్వీకారం చేసే క్రమంలో తెలంగాణ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడ్డారని రాష్ట్రీయ హిందూ వాహిని సంఘతన్ రాష్ట్ర అధ్యక్షుడు గొర్రె శ్రీనివాసులు తెలిపారు. అసదుద్దీన్ ఓవైసీ అనర్హత వేటుకు అర్హుడా, అనర్హుడా అనే విషయంలో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని కోరుతూ ఇటీవల సుప్రీం కోర్టును ఆశ్రయించానన్నారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరులోని ఆయన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసదుద్దీన్ ఓవైసీ ప్రమాణ స్వీకారం చేస్తూ ముగింపులో జై పాలస్తీనా అని ఉచ్చారణ చేశారన్నారు. పార్లమెంట్ మెంబర్లు పరదేశాలను ప్రార్థించినా, భక్తి చూపినా వారు అనర్హతకు గురవుతారన్నారు. అదే విషయంపై రాష్ట్రీయ హిందూ వాహిని సంఘతన్ తరఫున చట్టపరంగా ఫిర్యాదులు చేశామన్నారు. పార్లమెంట్ కమిటీ కూడా ఆయన రాజ్యాంగ ఉల్లంఘనలు జరిపారని నివేదిక ఇచ్చిందన్నారు. అయితే పలు కారణాలతో కేంద్ర ప్రభుత్వం, పార్లమెంట్ స్పీకర్, భారత రాష్ట్రపతి ఆయనపై చర్యలు తీసుకోలేకపోయారన్నారు. దేశంలో ఉంటూ పొరుగు దేశాల భక్తిని ప్రదర్శించే వారు పార్లమెంట్ మెంబర్‌గా కొనసాగడానికి అర్హత లేదన్నారు.

గంజాయి తాగే వారిపై డ్రోన్‌తో నిఘా

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు అధికారి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు గంజాయి తాగే వారిపై పోలీసులు నిఘా పెంచారు. వారిని గుర్తించేందుకు పోలీసులు డ్రోన్లు వినియోగిస్తున్నారు. ఈ మేరకు గురువారం నగరంలోని పలు రహస్య ప్రాంతాల్లో, పాడుబడిన ప్రాంతాల్లో, ముళ్ల పొదలు తదితర చోట్ల డ్రోన్లను ప్రయోగించి గంజాయిబ్యాచ్ ఎవరైనా ఉన్నారా అనే దానిపై ఆరాతీశారు. నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద ఉన్న ట్రావెల్స్ కార్యాలయాలపై పోలీసులు దాడులు చేసి అక్కడున్న సామగ్రిని పరిశీలించారు. గంజాయి, ఇతర పదార్థాలను అక్రమ రవాణా చేస్తున్నారా అనే కోణంలో తనిఖీలు చేస్తున్నారు.

MARGADARSI CHIT FUND PVT. LTD.
Chit Groups are available at our **PRODDATUR BRANCH.**

CHIT GROUP	DURATION IN MONTHS	MONTHLY INSTALLMENT	CHIT VALUE
FT VZ	40	1,25,000	50,00,000
FT Z	40	25,000	10,00,000
FT T	40	10,000	4,00,000
FT B	40	5,000	2,00,000
LT CC	50	60,000	30,00,000
LT C	50	30,000	15,00,000

Please Contact Branch Manager **Mr.G.VIJAYA BHASKAR,** for further details.
Mobile No. 80082-88878, Landline: 08564-256733, 243978.

రోడ్డు ప్రమాదంలో అత్తాకోడళ్ల దుర్మరణం


ఘటనాస్థలంలో మృతదేహాలు

సిద్దవటం, న్యూస్‌టుడే: శుభకార్యానికి వెళుతున్న అత్తాకోడళ్లు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన గురువారం రాత్రి సిద్దవటం మండలం మాధవరం-1 వద్ద కడప-చెన్నై జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. కడపలోని పాలెంపల్లె గ్రామానికి చెందిన ఈసం సుబ్బరాయుడు, తల్లి సుబ్బమ్మ, భార్య రత్నమ్మ, కుమార్తె వెంకట దీక్షితలు రాజంపేటలోని తమ బంధువుల ఇంట జరగనున్న శుభకార్యానికి వెళ్లేందుకు గురువారం రాత్రి ఆటోలో బయలుదేరారు. మాధవరం-1 పరిధిలోని ఎస్‌కేఆర్ నగర్ వద్ద గ్యాస్ లోడు ట్యాంకరు ఎదురుగా వచ్చి ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్బమ్మ, రత్నమ్మ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సుబ్బరాయుడు, వెంకటదీక్షితలు తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108లో కడప ఆసుపత్రికి తరలించారు.

బంగారు నగల అపహరణ

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప తాలూకా ఠాణా పరిధిలోని ఓ ఇంట్లో నాలుగు తులాల బంగారు నగలు, అరకిలో వెండి చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు. కడప రవీంద్రనగర్‌కు చెందిన శ్రీనివాసులు, ఆయన భార్య ఈ నెల 8న హైదరాబాదు వెళ్లారు. తిరిగి గురువారం ఉదయం ఇంటికి రాగా తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలకెళ్లి చూస్తే బీరువా తాళాలు కూడా బయటే ఉన్నాయి. అనుమానంతో తెరిచి చూడగా, అందులోని నాలుగు తులాల బంగారు నగలు, అరకిలో వెండి లేవు. దీంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై తాహిర్, సీసీఎస్ సీఐ భాస్కర్‌రెడ్డి, వేలిముద్ర నిపుణులు వచ్చి పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆన్‌లైన్‌లో విక్రయాలకు డ్వాక్రా ఉత్పత్తులు

బద్వేలు, న్యూస్‌టుడే: డ్వాక్రా ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్ పేర్కొన్నారు. బద్వేలు స్త్రీశక్తి భవనంలో గురువారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ)లోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. డీఆర్‌డీఏ జీవనోపాధి వనరుల జిల్లా ప్రాజెక్టు మేనేజరు వెంకటసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న స్విమ్స్ డైరెక్టర్

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని తిరుపతి శ్రీవెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ గురువారం సందర్శించారు.

బాల్య వివాహాల కట్టడికి చర్యలు


ప్రసంగిస్తున్న ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని, ఆదిశగా క్షేత్రస్థాయి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్త్రీ శిశు సంక్షేమాధికారి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. కడప కార్పొరేషన్ కార్యాలయంలో క్షేత్రస్థాయి అధికారులతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆడపిల్లల తల్లిదండ్రులు, బంధువులకు బాల్య వివాహాలతో జరిగే నష్టాలను వివరించాలన్నారు. పోలీసులు, రెవెన్యూ, ఐసీడీఎస్ అధికారులంతా కలిసికట్టుగా చర్యలు చేపట్టాలని సూచించారు. సీడీపీవోలు సునంద, అరుణకుమారి, సునీత, శ్రీలత, డీసీపీవో సుభాష్‌యాదవ్, ఓఎస్‌సీ పరిపాలనాధికారి అశ్విని, పలువురు మహిళా పోలీసులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఏఆర్ అదనపు ఎస్పీగా రమణయ్య

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీగా బి.రమణయ్యను నియమించారు. ఆయన తిరుపతిలో ఏఆర్ డీఎస్పీగా పని చేస్తూ పదోన్నతిపై కడపకు వస్తున్నారు. రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇక్కడ పని చేస్తున్న కృష్ణారావును ఇంటెలిజెన్స్ కార్యాలయానికి బదిలీ చేశారు.

ఐదేళ్ల డిగ్రీ కోర్సుల్లో నేరుగా ప్రవేశాలు

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: యోగి వేమన విశ్వవిద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాలలో ఎమ్మెస్సీ ఎర్త్ సైన్స్ విభాగంలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ అప్లైడ్ జియాలజీ, బయోటెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్, ఫైన్ ఆర్ట్స్, బీకాం ఆనర్స్ కోర్సుల్లో నేరుగా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు సంచాలకులు ఆచార్య డాక్టర్ లక్ష్మీప్రసాద్ పేర్కొన్నారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, ఆర్ట్స్ గ్రూపుల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తిగల వారు ఈ నెల 12వ తేదీ లోపు విశ్వవిద్యాలయంలోని అబ్దుల్ కలాం గ్రంథాలయ ప్రాంగణంలోని సంచాకుల కార్యాలయంలో అర్హత పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

హరూన్ బజాజ్ మేళాకు స్పందన

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: విజయదశమిని పురస్కరించుకుని హరూన్ బజాజ్ షోరూం ఏర్పాటు చేసిన మేళాకు విశేష స్పందన లభిస్తోందని మేనేజింగ్ డైరెక్టర్ ఎస్‌బీ అహ్మద్‌బాషా పేర్కొన్నారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 600 వాహనాలను విక్రయించగా, గురువారం ఒక్క రోజునే రోజున 128 వాహనాల అమ్మకం జరిగిందన్నారు. జనరల్ మేనేజరు పరమేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతి వాహన కొనుగోలుపై రూ.16 వేలు ఆదాతో పాటు క్యాష్‌బ్యాక్‌లు, ఇతర ఆఫర్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. షోరూం సిబ్బంది పాల్గొన్నారు.


వినియోగదారులకు వాహనం తాళాలు అందిస్తున్న నిర్వాహకులు

EENADU Classifieds

BUSINESS SERVICES

WANTED DEALERS/AGENTS

తిరుమల మిల్క్ ప్రొడక్ట్స్ పాలు, పాల పదార్థాలు పంపిణీ కొరకు ఏజెంట్లు / డీలర్లు కావలెను. కడప, మైదుకూరు, దువ్వూరు, చాగలమర్రి, కొండాపురం, మైలవరం, చాపాడు, బి.మఠం, K.రాజుపాలెం, పెద్దముడియం మొ॥ పట్టణాలలో పంపిణీదారులు కావలెను. సంప్ర: బ్రాంచి మేనేజర్, 96423 23435, కడప తిరుమల మిల్క్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్.

PERSONAL CLASSIFIEDS

LOST

సందు సునంద, D/o రామాం జనేయులు గారికి సంబంధించిన SSC ఒరిజినల్ మార్క్‌లిస్ట్ పోయినది. దొరికిన వారు సంప్ర: 94404 71416.

JOBS

కడప టౌన్‌లో ఉన్న ఆర్తి హోమ్ నందు పని చేయుటకు సైకాలజిస్ట్ మరియు నర్సు కావలెను. సంప్ర: 83319 51098, 9154918272.

కడప టౌన్ ద్వారకానగర్ లో ఉన్న నవీన్ న్యూరోకేర్ నందు పనిచేయుటకు అనుభవం కలిగిన రిసెప్షనిస్ట్, స్టాఫ్ నర్సులు కావలెను. సెల్: 8096953969.

FACULTY/ TEACHERS

Wanted Qualified and Experienced Teachers for Maths, Science and English for a reputed High School in Rayachoty. Attractive Salary for the Right Person. Contact: 79813 35600, 7093473533.

SECURITY GUARDS

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. కడపలో, 12గం డ్యూటీ 45 సం||లోపు వయసు ఉండాలి, మగవారు మాత్రమే. ✆ 72880 04466

ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
రూ॥ 350/- మాత్రమే
Contact:
KDP: 9989997626
8008514248
PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం


గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

ప్రొద్దుటూరు

● ప్రొద్దుటూరు ● జమ్మలమడుగు ● బద్వేలు ● మైదుకూరు

అల్లుకున్న 'నిర్లక్ష్యం'



పురపాలక పరిధి ఇందిరమ్మకాలనీలో విద్యుత్తు నియంత్రిక వద్ద ఏర్పాటు చేసిన రక్షణకు కంచెకు తీగజాతి మొక్క అల్లుకుపోయింది. చుట్టూ దట్టంగా పెరుగుతున్న మొక్క విద్యుత్తు నియంత్రికను చుట్టుకుంటున్నాయి. వర్షం కురిస్తే తీగజాతి మొక్కతో విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉంది. తీగజాతి మొక్కను తొలగించి ప్రమాదాలకు తావివ్వకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. విద్యుత్తు ఏఈ రామభద్రయ్యను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా లైన్‌మెన్‌ను ఆదేశించి మొక్క తీగను తొలగిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, మైదుకూరు**

ఆవుల గుంపులు... ప్రమాద హేతువులు



ప్రొద్దుటూరు పట్టణంలో పలుప్రాంతాల్లోని రోడ్లల్లో ఆవులు గుంపులుగా సంచరిస్తున్నాయి. అవి ఆ రోడ్లలో ప్రయాణించే వాహనదారులకు అడ్డురావడంతో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఏర్పడుతోంది. దీంతో వాహదారులతోపాటు ఆవులకు కూడా గాయాలవుతున్నాయి. రద్దీగా ఉన్న రోడ్లల్లో వాహనదారులు ఏమరుపాటుగా ఉంటే పెద్ద ప్రమాదాలే జరిగే అవకాశం ఉంది. అధికారులు చొరవ చూపి వాటి యజమానులకు, గోశాలలకు తరలించాలని ప్రయాణికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు వైద్యం**

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)

ప్రొద్దుటూరు	: 9966349431
జమ్మలమడుగు	: 9000409516
మైదుకూరు	: 8008573447
బద్వేలు గ్రామీణ	: 8008573493

స్పందనకు వందనం

● **ప్రొద్దుటూరు పట్టణం:** పట్టణంలోని గంగమ్మదేవళం జెండాచెట్టువీధిలో మురుగుకాలువలను ఒకటో డివిజన్ పారిశుద్ధ్య అధికారి వంకం సుబ్బరాయుడు ఆదేశానుసారం పారిశుద్ధ్య కార్మికులు మురుగు కాలువల్లో ఉన్న పూడికను తొలగించారు. ఈ సమస్యపై బుధవారం వార్తాంశం ప్రచురితమవడంతో అధికారులు స్పందించి పూడికను తొలగించారు.

● **ప్రొద్దుటూరు పట్టణం:** పట్టణంలోని గంగమ్మదేవళంవీధి సీతారాముల గుడి నుంచి మురుగు కాలువల్లో ఉన్న పూడికను గురువారం 22వ సచివాలయ వార్డు కార్యదర్శి రవికుమార్ ఆదేశంతో పారిశుద్ధ్య కార్మికులు పూడికను తొలగించారు. ఈ ప్రాంతంలోని సమస్యపై బుధవారం వార్తాంశం ప్రచురితం కావడంతో స్పందించి సమస్య పరిష్కరించారు.

?: కొండాపురం మండలం తాళ్లప్రొద్దుటూరు గ్రామంలో విద్యుత్తు నియంత్రికలు రోడ్లు విస్తరణ పనులు జరుగుతున్న రహదారి పక్కన ఉన్నాయి. దీంతో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. వాటిని తొలగించాలి. **- చంద్రశేఖర్‌రెడ్డి, తాళ్లప్రొద్దుటూరు**

✓: రహదారి పక్కన ఉన్న నియంత్రికలను తొలగిస్తాం. రహదారికి కొంత దూరంలో ఏర్పాటు చేసిన కొత్త దిమ్మెలపై నియంత్రికలను ఉంచుతాం. **-రామకృష్ణ, ఏఈ, విద్యుత్తుశాఖ, కొండాపురం**

?: కొండాపురంలోని నూతన బైపాస్ రోడ్డు నుంచి ప్రభుత్వ వైద్యశాల వరకు సీసీ రోడ్డు వేయించాలి. **-సుబ్బారావు, కొండాపురం**

✓: వైద్యశాలకు వెళ్లేందుకు సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని పలువురు మా దృష్టికి తీసుకువచ్చారు. పరిశీలించి తగు చర్యలు చేపడతాం. **-నాగప్రసాద్, ఎంపీడీవో, కొండాపురం**

?: కొండాపురంలోని రామసుబ్బారెడ్డి కాలనీలో మురుగు పారుతుండటంతో దోమలతో ఇబ్బంది కలుగుతోంది. అధికారులు బ్లీచింగ్ పిచికారీ చేయించాలి. **-ఓబయ్య, కొండాపురం**


✓: కాలనీలో వెంటనే పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. సిబ్బందికి తెలియజేసి బ్లీచింగ్ పిచికారీ చేయిస్తాం. అలాగే మురుగు నీరు రోడ్డుపై వేయకుండా అవగాహన కల్పిస్తాం.
-శశిధర్‌రెడ్డి, ఈవోపీఆర్డీ, కొండాపురం

?: వైద్యశాల వెనుక వైపు పిచ్చిమొక్కలతో అపరిశుభ్రంగా ఉన్నాయి. వాటిని తొలగించాలి **-బాబు, కొండాపురం**

✓: పిచ్చి మొక్కలను వెంటనే తొలగించి శుభ్రం చేయిస్తాం. అలాగే ఆసుపత్రి ఆవరణలో మొక్కలను నాటుతాము.
-సుజాత, వైద్యురాలు, కొండాపురం

-న్యూస్‌టుడే, కొండాపురం

సిరుల తల్లి... కల్పవల్లి




మైదుకూరు : దుర్గాదేవి అలంకారంలో పెద్దమ్మ దేవత



ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో ఆర్డీవో ఆదిమూలం సాయిశ్రీ కుటుంబ సభ్యులు



ప్రొద్దుటూరు రతనాల వేంకటేశ్వర స్వామి ఆలయంలో లలితాదేవిగా



ప్రొద్దుటూరు రాజరాజేశ్వరీదేవి ఆలయంలో మహిషాసురమర్దనిదేవి అలంకారం



పోరుమామిళ్లలో..

దసరా ఉత్సవాల సందర్భంగా ఆలయాలన్నీ సందడిగా మారాయి. దుర్గాష్టమి రోజున గురువారం వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దనిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, మైదుకూరు నియోజకవర్గాల మండలాల్లోని అమ్మవారి ఆలయాల్లో భక్తుల రద్దీ పెరిగింది. అమ్మవారు భక్తులకు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. అమ్మవారికి గణపతి పూజ, నవగ్రహపూజ, అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. **-న్యూస్‌టుడే, క్లస్టర్ బృందం**



మైదుకూరులో వాసవీ మాత



జమ్మలమడుగులో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు

త్వరలో కన్నెలవాగు ఆయకట్టుకు సాగునీరు

ఖాజీపేట, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కన్నెలవాగు చెరువును గురువారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా తెదేపా మండల నాయకులు, రైతులతో కలిసి ఆయన చెరువు వద్దకు చేరుకుని తెలుగుగంగ కాలువ నుంచి చెరువులోకి నీరు చేరేందుకు ప్రత్యేకంగా తవ్విన కాలువపై కాలినడకన వెళ్లి నీటి ప్రవాహాన్ని గమనించారు. త్వరలోనే చెరువు ఆయకట్టు రైతులకు సాగునీరు అందిస్తామన్నారు. నాయకులు లక్ష్మీరెడ్డి, చంద్రభాస్కర్‌రెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, దాసరి శ్రీనివాసులు, రెడ్యం రవీంద్రారెడ్డి, చంద్ర ఓబులరెడ్డి, హరినాథరెడ్డి, రామసుబ్బయ్య, బ్రహ్మనాయుడు, తొట్టేరాము తదితరులు పాల్గొన్నారు.



చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్, నాయకులు

పంట కాలువ ఏర్పాటుకు వినతి

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: వామికొండ రిజర్వాయర్‌కు పంటకాలువ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గాలిచంద్ర తెలిపారు. గురువారం మండల పరిధిలోని చిలమకూరు గ్రామంలోని బ్రహ్మంగారి గుడి వద్ద ఈ సమస్యపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వాయర్‌లో గత ఎనిమిదేళ్లుగా నీరుందని తెలిపారు. ఆ నీటిని రైతులు పొలాలకు ఉపయోగించేందుకు అవకాశం లేదని వివరించారు. ప్రభుత్వం చర్యలు తీసుకుని రైతులు నీటిని ఉపయోగించుకునే విధంగా పంట కాలువలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కడప పేరుపై వ్యతిరేకత ఎందుకు?

మైదుకూరు, న్యూస్‌టుడే : వైఎస్ఆర్ జిల్లా పేరును వైఎస్ఆర్ కడప జిల్లాగా మార్చాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ చేసిన ప్రతిపాదనను వైకాపా నాయకులు వ్యతిరేకించడం తగదని భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యుడు బీపీ వెంకట ప్రతాపరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తప్పుపట్టారు. అనంతపురం జిల్లా చీమలవాగుపల్లెలో పుట్టి బతుకుదెరువుకు పులివెందులకు వచ్చి, ఆపై రైల్వేకోడూరు వెళ్లి ప్రస్తుతం కడపలో నివాసం ఉన్న కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి కడప పేరుపై ఎందుకు వ్యతిరేకత చూపిస్తున్నారని ప్రశ్నించారు. ప్రొద్దుటూరులో పుట్టి గర్వంగా ప్రొద్దుటూరు వాసిగా చెబుతున్న మంత్రి సత్యకుమార్‌పై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు.

పేదల కాలనీలు... సమస్యల లోగిళ్లు

–న్యూస్‌టుడే, మైదుకూరు

మైదుకూరు పురపాలక సంఘ పరిధిలోని కాలనీల్లో ఏ ప్రాంతానికి వెళ్లినా సమస్యలు వెంటాడుతున్నాయి. ఈ దుస్థితి ప్రధానంగా జోసెఫ్‌పేట, సుందరయ్యకాలనీ, వెంకటసుబ్బయ్యకాలనీ, చెంచుకాలనీల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్యాలయాల్లో అధికారులకు, నివాస ప్రాంతాల వద్ద నాయకులకు గోడు వినిపించినా... పట్టించుకునేవారే కరవయ్యారు. ఆందోళనలు చేసినా ప్రగతి కనిపించలేదు. సిమెంట్‌రోడ్లు, మురుగుకాలువలకు నిధులు కేటాయించినా పనులు చేపట్టడంలో అధికారులు విఫలమయ్యారు. వికలాంగుల సేవా నిలయానికి పడమర వైపున దారికి సిమెంట్‌రోడ్డు వేయాలని ఆప్రాంతవాసులు ఏళ్ల తరబడి కోరుతున్నా స్పందించేవారు కరవయ్యారు. వీధి దీపాలు వెలగడం లేదు. జోసెఫ్‌పేట నుంచి సుందరయ్యకాలనీకి వెళ్లే దారిలోకి వృథా నీటితోపాటు మురుగునీరు చేరుతోంది. కొండపేట కాలువ పక్కనే ఉన్న అంకాలమ్మ ఆలయం నుంచి వెంకటసుబ్బయ్యకాలనీకి వెళ్లేదారి పక్కన ప్రభుత్వ స్థలంలో 120 కుటుంబాలు దాకా ఉన్నాయి. ఏడేళ్ల కిందట ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నారు. సుందరయ్యకాలనీగా నామకరణం చేశారు. ప్రధాన రహదారికి దిగువగా ఉండటం.. వంకకు పక్కన కాలనీ ఉండటంతో భారీ వర్షం నమోదైతే ఎగువ నుంచి వచ్చే నీటితో కాలనీలోకి నీరు ప్రవేశిస్తోంది. కాలనీలో తాగునీటి పైపులైను, సిమెంట్‌రోడ్లు వేయాలని, విద్యుత్తు సౌకర్యం కల్పించాలని గతంలో పురపాలక కార్యాలయంలో సీపీఎం నాయకులతో కలిసి పేదలు ఆందోళనలు చేసినా కనికరించే వారే కరవయ్యారు. వెంకటసుబ్బయ్య కాలనీలో వాటర్‌ప్లాంట్ వద్ద సిమెంట్‌రోడ్డు లేదు. మురుగుకాలువలు లేవు. కాలనీ మీదుగా వెళ్లే వంక పిచ్చిమొక్కలతో నిండిపోయింది. శ్మశానవాటిక ఆక్రమణకు గురవుతున్నట్లు కాలనీవాసులు చెబుతున్నారు. వెంకటసుబ్బయ్యకాలనీ నుంచి చెంచుకాలనీకి వెళ్లే దారి అధ్వాన్నంగా మారింది. వర్షమొస్తే రాకపోకలకు సమస్యను ఎదుర్కొంటున్నారు. చెంచుకాలనీ నుంచి ఇందిరమ్మకాలనీ కలిపే దారి సిమెంట్‌రోడ్డుకు నోచుకోలేదు. కాలనీల సమస్యలను ప్రాధాన్యానికి అనుగుణంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోనున్నట్లు కమిషనర్ ఎం.శ్రీనివాసులరెడ్డి 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ప్రజాప్రతినిధులతో చర్చించి అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.



జోసెఫ్‌పేటలో వీధిలోకి చేరిన మురుగునీరు

వీధి దీపాలు వెలగడం లేదు



25ఏళ్లుగా నివాసం ఉంటున్నాం. రోడ్డు బాగా లేదు. వీధి దీపాలు వెలగడం లేదు. వీధిని అభివృద్ధి చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలి. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించాలి. **-హుస్సేన్, శాంతినగర్**

వర్షం వస్తే మురుగుమయం



జోసెఫ్‌పేట వీధుల్లో వర్షపునీరు నిల్వ చేరుతోంది. మురుగునీరు వెళ్లే కాలువ ఉంది. పెద్ద వర్షం వస్తే వీధిలోకి నీరు చేరుతోంది. పెద్ద నాయకుల దగ్గర నుంచి చిన్న నాయకుల వరకు కాలనీ సమస్యలను లేవనెత్తుతున్నా పరిష్కారానికి నోచుకోలేదు. కాలనీలోని మురుగునీరు వంకలోకి చేరేలా కాలువను నిర్మించాలి. **-వెంకటరమణ, జోసఫ్‌పేట**

మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా లవణం కృషి

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా గోపరాజు లవణం కృషి చేశారని విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక హోమస్‌పేటలో ఉన్న సృజన కార్యాలయంలో సాయంత్రం గోపరాజు లవణం జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గోపరాజు లవణం చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చిన్నతనంలోనే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న ఆయన అస్పృశ్యత, కుల నిర్మూలనకు పోరాటం చేశారని కొనియాడారు. భారత నాస్తిక సమాజం నాయకులు పల్లవోలు రమణ మాట్లాడుతూ సంస్కార్ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి తెలంగాణాలోని నిజామాబాద్ జిల్లాలో జోగిని వ్యవస్థను రూపుమాపేందుకు పోరాటం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులురెడ్డి, సీమ మహిళా శక్తి నాయకురాలు లక్ష్మీదేవి, హరిత, సీఎంఎస్ పద్మ, ఎల్లయ్య, కుమార్, రాము తదితరులు పాల్గొన్నారు.



గోపరాజు లవణం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న విరసం నాయకురాలు వరలక్ష్మి, తదితరులు

అక్రమ రిజిస్ట్రేషన్ల రద్దుకు ఆదేశాలు

జమ్మలమడుగు, ముద్దనూరు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో 57 అక్రమ రిజిస్ట్రేషన్‌లను రద్దు చేస్తూ కలెక్టర్ శివశంకర్ నిర్ణయం తీసుకోవడంతో తదుపరి చర్యలకు మండలస్థాయి అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఒక్క ముద్దనూరు మండలంలోనే 53 అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తేల్చారు. ఐదింటిలో అయిదు గ్రామాల్లో సుమారు 25 ఎకరాల్లో అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు అంచనాకు వచ్చారు. ముద్దనూరు, కొర్రపాడు, ఉప్పలూరు, కొసినేపల్లె, బొందలకుంట గ్రామాల్లో ఈ తంతు కొనసాగింది. సర్వే నంబరు 161-2లో బొందలకుంట భూమి 1.33 ఎకరాలు, సర్వే నంబరు 576-1లో బొందలకుంట భూమి 5.00 ఎకరాలు, సర్వే నంబరు 86-2లో కొసినేపల్లె భూమి 5.79 ఎకరాలు, సర్వే నంబరు 228లో ఉప్పలూరు భూమి 2.21 ఎకరాలు, సర్వే నంబరు 695-4లో కొలవల్ భూమి 2 ఎకరాలు, సర్వే నంబరు 347-2 కొలవల్ భూమిలో 36 స్థలాలు, సర్వే నంబరు 228 ఉప్పలూరు భూమిలో 12 స్థలాల్లో రిజిస్ట్రేషన్లు జరిగినట్లు అధికారులు తేల్చారు. కొన్ని సర్వే నంబర్లకు సంబంధించి భూముల వివరాలు తెలియాల్సి ఉంది. తహసీల్దారు వద్ద ... అధికారులు ముద్దనూరు మండలంలో 53 అక్రమ రిజిస్ట్రేషన్లకు ఉన్నతాధికారులు రద్దు నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు ఆయా గ్రామాల్లో జరిగినట్లు సర్వే నంబర్ల ద్వారా తెలుసుకుని పూర్తిస్థాయి నివేదికను జమ్మలమడుగు ఆర్డీవోకు అందజేస్తామన్నారు.

పెరిగిన ప్రవాహం... రైతులకు ఆనందం

బి.కోడూరు, న్యూస్‌టుడే: మండలంలో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో చెప్పిన విధంగా సగిలేరు డ్యాం నుంచి ఎడమ కాలువకు నీరు విడుదల అయింది. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు సగిలేరు డ్యాం ద్వారా ఎడమ కాలువ గేటును ఎత్తి నీటిని విడుదల చేస్తామని జలవనరుల శాఖ ఈఈ వెంకటాచలం, డీఈ వేణుగోపాల్‌రెడ్డి గురువారం తెలిపారు. సగిలేరు డ్యాం ప్రస్తుతం నీటి మట్టం 511 ఎమ్‌ఎఫ్‌టీ ఉందని చెప్పారు. బి.కోడూరు సగిలేరు ఎడమ కాలువ ద్వారా నీటిని తరలించి అన్ని చెరువులు నింపి తదనంతరం బద్వేలు పెద్ద చెరువుకు కూడా కొనసాగిస్తామన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ద్వారా రైతులకు మంచి జరుగుతుందని తెదేపా మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి తెలిపారు.



జలాశయంలో పెరిగిన నీటి మట్టం

సాహస క్రీడల శిక్షణతో ఉజ్వల భవిష్యత్తు

జమ్మలమడుగు (గ్రామీణ), న్యూస్‌టుడే: సాహస క్రీడల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సాహస క్రీడా శిక్షణ చీఫ్ ఆఫ్ ఆపరేషన్స్ (సీవో) శేఖర్‌బాబు పేర్కొన్నారు. జిల్లాలో పర్యాటక కేంద్రమైన గండికోటలోని సాహస క్రీడా శిక్షణ కేంద్రంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన 56 మంది విద్యార్థులకు నాలుగురోజుల పాటు నిర్వహించిన శిక్షణ గురువారంతో విజయవంతంగా ముగిసింది. చిన్న వయస్సులోనే ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన పూర్ణ మలావత్, అన్వితరెడ్డి, దుర్గారావులు సాహస క్రీడా శిక్షణలో విద్యార్థులను మెలకువలు, నైపుణ్యాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు మురళీకృష్ణ, ఈశ్వర్, జశ్వంత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పెన్నా కొండలపై నుంచి రాపెల్లింగ్ చేస్తూ..

సమస్యలు విన్నవిస్తే పరిష్కరిస్తాం

గ్రామాల్లో నెలకొన్న సమస్యలను క్షేత్రస్థాయిలో ప్రత్యేక్షంగా గుర్తించి పరిష్కరించడానికే ప్రభుత్వం గ్రామోదయం కార్యక్రమం నిర్వహిస్తోందని అధికారులు తెలిపారు. గురువారం వివిధ శాఖల జిల్లా, డివిజన్, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి అధికారులు గ్రామోదయం కార్యక్రమాలు ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, మైదుకూరు నియోజకవర్గ మండలాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం తప్పక ఉండాలన్నారు. అధికారుల క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం అధికారుల బృందం చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. **-న్యూస్‌టుడే, క్లస్టరు బృందం**



బద్వేలు పట్టణంలో కాలువను పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రమోహన్, కమిషనర్ నర్సింహారెడ్డి



చాపాడు: నెర్రవాడలో చిన్నారులతో కలిసి భోజనం రుచి చూస్తున్న ప్రత్యేకాధికారిణి విజయలక్ష్మి, అధికారులు

పేదల భూములు ఆక్రమణకు గురవుతున్నా పట్టదా?

బ్రహ్మంగారి మఠం, న్యూస్‌టుడే: మండలంలో 17 ఏళ్ల కిందట పేదలకు అసైన్మెంట్ కమిటీ పంపిణీ చేసిన పట్టా భూములకు ఇంతవరకు హద్దులు చూపలేదని, వాటిని కొందరు ఆక్రమిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శివకుమార్ ప్రశ్నించారు. గురువారం స్థానిక తహసీల్దారు దామోదర్‌రెడ్డికి ఆయన వినతి పత్రాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ పేదలకు చెందిన భూములు నరసన్నపల్లె, సోమిరెడ్డిపల్లె, రేకలకుంట, పలు గురాళ్లపల్లె, ముడుమాల, పాపిరెడ్డిపల్లె పలు గ్రామాల్లో పెద్ద ఎత్తున భూములు ఆక్రమణకు గురౌతున్నాయన్నారు. ఆక్రమించిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిజమైన అబ్దిదారులకు ప్రభుత్వం ఇచ్చిన భూములకు హద్దులు చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గండి సునీల్, రాజశేఖర్, దేవ, అరవింద్, ప్రదీప్, తదితరులున్నారు.



తహసీల్దారుకు వినతి ఇస్తున్న శివకుమార్, యువకులు

కలెక్టరు, జేసీలతో ఎమ్మెల్యే భేటీ

మైదుకూరు, న్యూస్‌టుడే : శాసనసభ్యుడు పుట్టా సుధాకర్ యాదవ్ గురువారం జిల్లా కలెక్టర్ శివశంకర్, జేసీ అదితిసింగ్‌తో భేటీ అయ్యారు. జిల్లా కలెక్టరేట్‌లో భేటీ అయిన సందర్భంగా నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధిపై చర్చించి నిధుల కేటాయించాలని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నిధుల మంజూరుకు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.

విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యంతో గేదె మృతి

బి.కోడూరు, న్యూస్‌టుడే: విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యంతో తువ్వపల్లె గ్రామానికి చెందిన గేదె మృతి చెందింది. రైతు పత్తిపాటి చిన్న గుర్రయ్య వివరాల మేరకు.. తమటంవారిపల్లె ఫీడరు రెండు రోజులుగా 11 కేవీ విద్యుత్తు తీగలు నేలపై కింద ఉన్నాయన్నారు. గురువారం ఉదయం తువ్వపల్లె గ్రామం చెరువు సమీపంలో గేదె మేత మేయడానికి వెళ్లి తీగలు తగిలి అక్కడికక్కడే మృతిచెందిందని చెప్పారు. గేదె సుమారు రూ.70 వేల విలువ చేస్తుందని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు విలపించారు.

స్వయంప్రతిపత్తి నిర్ణయం ఆమోదయోగ్యం

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే: దేవాలయాలకు, మఠాలకు, పీఠాలకు స్వయంప్రతిపత్తి కలిగిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆనందదాయమని శ్రీ ఈశ్వరీదేవ మఠాధిపతి వీరశివకుమారస్వామి, ఇడమకంటి జనార్దనా శివాచారి అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ ఈ ప్రభుత్వానికి మేలు చేకూరాలని అన్నారు. దేవాలయాల వ్యవస్థ అభివృద్ధికి ఇలాంటి నిర్ణయాలు మంచిదన్నారు. ఆలయాల్లో వైదిక ఆచార వ్యవహారాల్లో, అధికారులు, రాజకీయ నాయకుల జోక్యం తగ్గించేందుకు ప్రత్యేక జీవోను ప్రభుత్వం దసరా పండగ సందర్భంగా తీసుకురావడం హర్షించదగ్గ విషయమన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

G.అనుషా, D/o G.V.సుధాకర్, డి.నెం.8/400, స్వయంసేవక్ రోడ్డు, ప్రొద్దుటూరు, వై.ఎస్.ఆర్.జిల్లా, A.P., పాస్‌పోర్ట్ నెం. R851572 పోయినది. తెలిసినవారు వెంటనే తెలియజేయగలరు.
Cell : 9959661646

మూలకు చేరిన ఈ-ఆటోలు

● అస్తవ్యస్తంగా ఇంటింటి చెత్త సేకరణ
● జమ్మలమడుగు నగర పంచాయతీలో దుస్థితి

–న్యూస్‌టుడే, జమ్మలమడుగు

ఇంటింటి చెత్త సేకరణ కోసం కేటాయించిన ఈ-ఆటోలు (విద్యుత్తు ఆటోలు) మూలకు చేరాయి. రూ.లక్షలు వెచ్చించి నగర పంచాయతీ, మునిసిపాలిటీ, నగర పాలక సంస్థలకు అప్పగిస్తే కొన్ని నెలలకే గ్యారేజీ బాట పట్టాయి. దాంతో ఇంటింటా చెత్త సేకరణ ఆశయం అటకెక్కింది. జమ్మలమడుగు నగర పంచాయతీకి ఆరు ఈ-చెత్త ఆటోలు వస్తే అన్ని వాహనాలు పనిచేయక పోవడంతో మస్టర్ పాయింట్‌కే పరిమితం కావడం గమనార్హం.

వాహనాలు గ్యారేజీ బాట

స్వచ్ఛ సంకల్ప క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా చెత్త సేకరణకు జమ్మలమడుగు నగర పంచాయతీకి ఆరు ఎలక్ట్రిక్ ఆటోలనుప్రభుత్వం కేటాయించింది. గతేడాది జులై 19వ తేదీన సమకూర్చారు. ఐదారు నెలలకే ఒక్కొక్కటీ గ్యారేజీ బాట పట్టాయి. వీటి కోసం ప్రభుత్వం ఒక్కో వాహనానికి రూ.4.10 లక్షలు ఖర్చు చేసి పర్యావరణ హితం ఛార్జింగ్ బ్యాటరీలు ఉండేలా రూపొందించారు. పట్టణంలోని ప్రధాన వార్డులతోపాటు నాగులకట్ట, బీసీ కాలనీ, కన్నెలూరు, ఎత్తపువారి కాలనీల్లో ఈ-ఆటోలు చెత్త సేకరణ చేసేవి. గేరు బాక్సులో సమస్యలు, రివర్స్ గేర్ పనిచేయక పోవడం, ఛార్జింగ్ సమస్య తదితర కారణాతో నిలిచిపోయాయి. నిలిచిపోయిన వాహనాలను బాగు చేయాలంటే ఆ కంపెనీకి చెందిన మెకానిక్‌లు మాత్రమే వచ్చి బాగు చేయాల్సి ఉంటుంది. గతంలో కమిషనర్‌గా పనిచేసిన వెంకటరామిరెడ్డి విజయవాడ నుంచి మెకానిక్‌ను పిలిపించి మరమ్మతులు చేసేందుకు ప్రయత్నించారు. వాహనాలకు సంబంధింది సామగ్రి అందుబాటులో లేకపోవడంతో వారు వెళ్లిపోయారు. అప్పట్నుంచి ఆరు వాహనాలు నిరుపయోగంగా మారాయి. ఈ విషయమై నగర పంచాయతీ కమిషనర్ వెంకటరామిరెడ్డిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా వాహనాలను వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. ఆరు ఈ-ఆటోలు ఉండగా అన్నీ చెత్త సేకరణ చేయడంలేదన్నారు. వీటిని తయారుచేసిన సంస్థతో మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొస్తామన్నారు.



మరమ్మతులకు నోచుకోని వాహనాలు

వార్డుల్లో వివరాలు

ఇళ్లు	: 12,516
జనాభా	: 52,889
వార్డులు	: 20

రోజుకు ఉత్పత్తి అవుతున్న చెత్త : 26 టన్నులు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

కడప
• కడప • పులివెందుల • కమలాపురం

నీట మునిగిన పెసర, మినుము


వీరపునాయునిపల్లెలో పంట పొలాల్లో నీరు

వీరపునాయునిపల్లె, న్యూస్‌టుడే: గాలేరు-నగరి కాలువ నుంచి పాపఘ్ని నదిలో కలిసే విధంగా బుధవారం నీటిని వదిలారు. ఈ సమాచారం రైతులకు లేకపోవడంతో పాటు అధికారులు సరైన పరిశీలన చేయకపోవడంతో వాగు వెంట వేసిన పెసర, మినుము పంటలు మునిగిపోయాయని రైతులు వాపోతున్నారు. గుత్తేదారులు వంకను లోతుగా తవ్వకుండా కంపచెట్లు తొలగించి చేతులు దులుపుకున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. నష్టపోయిన వారికి పరిహారం చెల్లించాలని మండలంలోని ఆయాగ్రామాల రైతులు డిమాండ్ చేశారు.

అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు


పులివెందులలో స్థానికులతో మాట్లాడుతున్న ఆర్డీవో ప్రత్యూష

పులివెందుల (వేంపల్లె), న్యూస్‌టుడే: గ్రామాల్లోని పేదలందరికీ ప్రభుత్వ ఫలాలు అందించడమే లక్ష్యమని పులివెందుల ఆర్డీవో ప్రత్యూష అన్నారు. గ్రామోదయం-నగరోదయం కార్యక్రమంలో భాగంగా పట్టణపరిధిలోని ఎర్రగుడిపల్లెలో ఆమె పర్యటించి ప్రజలను అడిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పురపాలిక ఛైర్మన్ వరప్రసాద్, కమిషనర్ రాముడు, ఐసీడీఎస్ సీడీపీవో శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

పెన్నాలో గల్లంతైన యువకుడి మృతి

సిద్దవటం, న్యూస్‌టుడే : సిద్దవటం పెన్నానదిలో బుధవారం గల్లంతైన జేమ్స్ (28) అనే యువకుడు మృతి చెందాడు. కడపలోని బీడీ కాలనీకి చెందిన జేమ్స్ పెయింటింగ్ పనులు చేస్తుంటారు. ఈయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. జేమ్స్ బుధవారం స్నేహితులతో కలిసి సిద్దవటం వచ్చి ప్రమాదవశాత్తూ పెన్నాలో మునిగిపోయారు. ఆయన ఆచూకీ కోసం గురువారం ఒంటిమిట్ట సీఐ కృష్ణంరాజు పర్యవేక్షణలో పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. వంతెనకు సమీపంలోని ఒడ్డున ముళ్లకంప చెట్ల వద్ద జేమ్స్ మృతదేహం లభ్యమైంది.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత

పులివెందుల (వేంపల్లె), న్యూస్‌టుడే: పులివెందుల పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల వద్ద తప్పిపోయిన బాలుడిని గురువారం పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. కళాశాల వద్ద మధ్యాహ్నం ఓ చిన్నారి ఒంటరిగా ఉండడాన్ని స్థానికులు గుర్తించి పులివెందుల అర్బన్ సీఐ గంగనాధ్‌బాబుకు అప్పగించారు. దీనిపై పోలీసులు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. కుమారుడి ఆచూకీ కోసం వెతుకుతున్న తల్లిదండ్రులు రాణి, రాజేంద్రలు సాయంత్రం పోలీస్‌స్టేషన్‌కు రావడంతో వారికి అప్పగించారు.

మద్యం కేసులో జైలు శిక్ష

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడపకు చెందిన చెందిన శ్రీను సెప్టెంబరు 24న మద్యం తాగి ద్విచక్రవాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. అతడిని కోర్టులో హాజరుపరచగా ఫస్ట్ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి మంగళగౌరి కేసు వివరాలు పరిశీలించి 20 రోజులు జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ జావెద్ తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప రెండో పట్టణ ఠాణా పరిధిలో మాసాపేట సమీపంలోని దొరలు సమాధుల వద్ద కడపకు చెందిన ముక్తియార్, రాయచోటికి చెందిన కమవుల్లాతో పాటు మహిళను అరెస్టు చేసి, వారి నుంచి 1250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

వారసత్వ నిలయం... కళావిహీనం
సిద్దవటం కోటను పట్టించుకోని అధికారులు


సిద్దవటంలోని మట్లిరాజులకోట ముఖద్వారం పక్కన కూలిన ప్రహరీ

న్యూస్‌టుడే, సిద్దవటం

సిద్దవటంలోని చారిత్రక మట్లిరాజుల దుర్గం (కోట) ఎంతో ప్రసిద్ధి చెందింది. శతాబ్దాల కిందట నిర్మించిన దుర్గంలోని కట్టడాలు (గచ్చు లేకుండా రాతి నిర్మాణం) అరుదైనవిగా పేరు పొందాయి. వారసత్వ సంపదగా నిలిచిన ఈ కోటలో కొన్ని నిర్మాణాలు దెబ్బతిన్నాయి. సంబంధిత శాఖ నిర్వహణ లోపంతో సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతో పురాతన దుర్గం కళాహీనంగా దర్శనమిస్తోంది.

చరిత్రకు చెదలు : సిద్దవటం పెన్నానది ఒడ్డున 1527లో మట్టికోట స్థానంలో మట్లి ఎల్లమరాజు బలమైన రాతికోటగా పునర్నిర్మించారు. పలువురు రాజులు పాలించిన అనంతరం తుది దశలో నైజాం నవాబుల నుంచి ఈ కోట 1800లో ఈస్టు ఇండియా కంపెనీ వారి ఆధీనంలోకి వెళ్లింది. ఆంగ్లేయుల పాలన ముగిసిన తర్వాత కేంద్ర ప్రభుత్వం పరిధిలోకి వచ్చింది. ఇక్కడ ప్రధాన ముఖద్వారం, మొదటి మండపం, ఢంకానగర్, రెండో మండపం, కామాక్షిగుడి, బిస్మిల్లా దర్గా, మసీదు, రాణిమహల్, భారీ బురుజులు చరిత్రకు, వారసత్వ సంపదకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. మరికొన్ని నిర్మాణాలు శిథిలావస్థకు చేరి కూలిపోయి కాలగర్భంలో కలిసిపోయాయి. 2021లో కురిసిన భారీ వర్షాలకు మొదటి ప్రధాన ముఖద్వారం కుడి పక్కన ప్రహరీలు, తూర్పు వైపున, పెన్నానది వైపున ఉండే పురాతన ప్రహరీలు దెబ్బతిని నేలకూలాయి. మూడేళ్ల గడుస్తున్నా నేటికీ మరమ్మతులకు నోచుకోకపోవడంతో సందర్శకులు పెదవి విరుస్తున్నారు.

మరమ్మతులు చేపట్టరా?

మరమ్మతుల కోసం కొన్ని నెలల కిందట పురావస్తుశాఖ అధికారులు తాడిపత్రి నుంచి నిర్మాణ రాళ్లను కోట వద్దకు చేర్చారు. పనులు మాత్రం ఇంకా ప్రారంభించలేదు. దీంతో సామగ్రి మురుగుతున్నాయి. ప్రహరీలతో పాటు కోటలో మరికొన్ని పురాతన కట్టడాలు దెబ్బతిన్నాయి. ప్రధాన ముఖద్వారం ముందువైపున ఉన్న ప్రహరీ పనులు అసంపూర్తిగా కన్పిస్తున్నాయి. త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని సందర్శకులు కోరుతున్నారు.

టెండరు ప్రక్రియ సాగుతోంది

మట్లిరాజుల కోటలో దెబ్బతిన్న ప్రహరీలకు మరమ్మతులు చేసేందుకు ఇటీవల ఆన్‌లైన్‌లో టెండరు ప్రారంభమైంది. గడువు ముగియగానే ప్రక్రియ పూర్తి చేసి త్వరితగతిన మరమ్మతులు నిర్వహించేందుకు చర్యలు చేపడతాం. **- బాలకృష్ణారెడ్డి, పురావస్తుశాఖ జిల్లా అధికారి,**

ఇడుపులపాయలో జగన్‌కు షాక్
☛ జనసేనలోకి మాజీ సర్పంచి


మంత్రి మనోహర్‌తో వెంకటచలపతి

వేంపల్లె, న్యూస్‌టుడే: వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అడ్డా అయిన వైఎస్ఆర్ జిల్లా వేంపల్లె మండలం ఇడుపులపాయలో ఆయనకు షాక్ తగలనుంది. మాజీ సర్పంచి, వైకాపా నేత పోతిరెడ్డి వెంకటచలపతి జనసేనలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఇందులో భాగంగా రెండురోజుల కిందట ఆయన గుంటూరు జిల్లా తెనాలి వెళ్లి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి చర్చించారు. ఆయన చేరికకు మంత్రి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. వైకాపా అయిదేళ్ల పాలనలో వేంపల్లె మండలానికి చెందిన ఒకరిద్దరికే కాంట్రాక్టు పనులు, ఇతర ప్రయోజనాలు చేకూర్చారని, ఈ విషయమై చెప్పినా నాయకులు పట్టించుకోలేదని మాజీ సర్పంచి కొంతకాలంగా అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయన పార్టీ మారాలని నిర్ణయించుకున్నారు. ఆయనతోపాటు వేంపల్లె, చక్రాయపేట మండలాలకు చెందిన పలువురు నేతలు జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి సీఎం పవన్‌కల్యాణ్ సమక్షంలో త్వరలో ఆ పార్టీలో చేరనున్నారని వైకాపా అసంతృప్తి వర్గాలు తెలిపాయి.

ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదు


శిశు సంరక్షణ సంస్థను పరిశీలిస్తున్న జడ్జి బాబా ఫకృద్దీన్

కడప న్యాయవిభాగం, న్యూస్‌టుడే: అందరూ ఆరోగ్యంగా ఉండాలని, దానికి మించిన ఆస్తి లేదని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్ పేర్కొన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కడపలో రిమ్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం కడపలోని వృద్ధాశ్రమాలు, స్వధార్ హోమ్, మా అమ్మ ఒడి, శిశు సంరక్షణ సంస్థలను జడ్జి పరిశీలించారు. వంటశాల, వసతి గదులను తనిఖీ చేశారు.

ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి


అధికారులతో కలిసి పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి

కమలాపురం, న్యూస్‌టుడే : మండలంలోని దేవరాజుపల్లెను ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి అన్నారు. గ్రామోదయం కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామంలో పర్యటించారు. ఎస్సీ కాలనీల్లో మౌలిక వసతులపై పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. అనంతరం చెత్తసంపద కేంద్రాలను పరిశీలించి, తడి, పొడి చెత్తను వేరు చేసి యార్డుకు తరలించాలన్నారు. ఈవోపీఆర్డీ కెజియా, హౌసింగ్ ఏఈ ప్రతాప్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బమ్మ, పంచాయతీ కార్యదర్శి గంగాధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వల్లూరులో జేసీ పర్యటన


వల్లూరు మెయిన్ బజారులో పర్యటిస్తున్న జాయింట్ కలెక్టరు అదితిసింగ్, అధికారులు

వల్లూరు: పల్లెబాట గ్రామోదయం కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం జాయింట్ కలెక్టరు అదితిసింగ్ అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి గర్భిణులు, చిన్నారులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. పీహెచ్‌సీలో మందుల నిల్వలు, భవన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆవరణలో ఉంచిన ఇసుక ట్రాక్టర్లపై పోలీసు సిబ్బందిని వివరాలు అడిగారు. ఇసుక వృథా కాకుండా ప్రభుత్వ కార్యాలయాలు, గృహ నిర్మాణాలకు ఉపయోగించాలని ఆదేశించారు. పార్కు, సామూహిక గోకులాన్ని అందుబాటులోకి తేవాలని తెదేపా మండల సమన్వయకర్త నాగేశ్వర్‌రెడ్డి కోరారు. అనంతరం చెత్త నుంచి సంపద కేంద్రంలో ఉద్యోగులు, స్థానికులతో సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి కృష్ణకిషోర్, తహసీల్దారు శ్రీవాణి, ఎంపీడీవో రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

మహిష మర్దని... భక్తజన పావని

దసరా నవరాత్రి మహోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. వివిధ ఆలయాల్లో అమ్మవారిని గురువారం మహిషాసుర మర్దని, సంతానలక్ష్మి, కాళీమాత తదితర రూపాల్లో అలంకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక దర్శనాలు ఏర్పాటుచేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- న్యూస్‌టుడే, బృందం


కడప బాలపోలేరమ్మ ఆలయంలో...


మహాగౌరిగా విజయదుర్గాదేవి


నబీకోటలోని చౌడమ్మ ఆలయంలో...


వల్లూరులో...


కడప ఆకులవీధిలో


సిద్దవటం మండలం ఉప్పరపల్లెలో


కడప అమ్మవారిశాలలో...


దేవునికడపలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి


కమలాపురంలో


ఒంటిమిట్టలో...


వేంపల్లె అమ్మవారిశాలలో పార్వతీదేవి అలంకరణలో


ఎర్రముక్కపల్లె మారెమ్మ తల్లి ఆలయంలో భక్తులు


నడివీధి గంగమ్మ ఆలయంలో సంతానలక్ష్మిగా...


వేములలో...





దేశసేవలో తరించిన రతన్‌టాటా

కమలాపురం: విలువలతో కూడిన జీవితం గడిపి, తుది శ్వాస వరకు దేశసేవలోనే తరించిన వ్యక్తి రతన్‌టాటా అని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డి అన్నారు. గురువారం కడప పుత్తా ఎస్టేట్‌లోని తన కార్యాలయంలో దిగ్గజ వ్యాపారవేత్త రతన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన లేని లోటు తీర్చలేనిదని చెప్పారు. తెదేపా నాయకులు పుత్తా లక్ష్మీరెడ్డి, పుత్తా ఎల్లారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మారుతీనగర్: స్థానిక విశ్వప్రగతి చిట్‌ఫండ్ కార్యాలయంలో గురువారం వ్యాపార దిగ్గజం రతన్‌టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు తుంగ రమణయ్య, ఆర్ఎస్‌యూ జాతీయ అధ్యక్షులు రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ రతన్‌టాటా మృతి దేశానికి తీరని లోటని పేర్కొన్నారు.

వసతి గృహాల తనిఖీ

సిద్దవటం, న్యూస్‌టుడే : సిద్దవటంలోని బీసీ బాలుర, బాలికల వసతి గృహాలను గురువారం సిద్దవటం కోర్టు బాధ్య న్యాయమూర్తి గాయత్రి గురువారం తనిఖీ చేశారు. పలు గదులకు కిటికీలు పాడై ఉండడం, ఫ్యాన్లు, ఇతర వసతులు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నిధులు మంజూరు కాగానే మరమ్మతు పనులు చేస్తామని సంబంధిత వసతి గృహ అధికారి ప్రసాద్ పేర్కొన్నారు. న్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బడుగులకు రాజ్యాధికారమే లక్ష్యం

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: బడుగు, బలహీన వర్గాలు రాజ్యాధికారాన్ని సాధించడానికి కృషి చేయాలని చేతివృత్తుల పార్టీ జాతీయ కార్యదర్శి అవ్వారు మల్లికార్జున్ అన్నారు. కడప ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏపీ దళిత మిత్ర సంఘం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలు రాజకీయంగా ఎదగాలన్నారు. త్వరలో నాలుగు జిల్లాల ప్రతినిధులతో కొత్త రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. నాగభూషణం, రామాంజనేయులు, బాబు, ఓబులేసు పాల్గొన్నారు.



(c) eenadu